J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 41 సంచిక : 22 04.11.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## ఈ ఫలితాలు దేనికి సంకేతం..?

➤ ఆంధ్రలో వైసీపీకి తెలంగాణలో బీజేపీకి 'ఉప'కరించిన బై-పోల్

➤ జగన్ పురోగమనం కేసీఆర్ తిరోగమనం

➤ ఇతర రాష్ట్రాల్లో బోల్తా కొట్టిన బీజేపీ




***ఆంధ్రలోని బద్వేలు, తెలంగాణలోని హుజురాబాద్ ఉప ఎన్నికలు, ఇక్కడ వైసిపికీ అక్కడ బీజేపీకి ఉపకరించాయని చెప్పొచ్చు. దేశంలో మిగిలిన చోట్ల భారతీయ జనతా పార్టీకి అన్నీ చేదు అనుభవాలే. తెలంగాణలో కూడా విజయం రాజేందర్‌దే తప్ప కమలంది కానే కాదు. ఇక ఆంధ్రాలో మాత్రం జయం జగన్‌దే.***

రెండు తెలుగు రాష్ట్రాలలో ఆసక్తి రేకెత్తించిన ఉప ఎన్నికలలో రాజకీయ మేధావులు ఊహించిన ఫలితాలే వచ్చాయి. ఆంధ్రలో జగన్ హవా అప్రతిహతంగా కొనసాగుతోందని మరోసారి రుజువయ్యింది. జగన్‌కు సొంత జిల్లా అయిన కడపలోని బద్వేలు నియోజకవర్గానికి జరిగిన ఉపఎన్నికలో, వైసీపీ అభ్యర్థి డాక్టర్ సుధకు 90 వేలకుపైగా మెజారిటీని ఓటర్లు కట్టబెట్టారు. రాజకీయ రణక్షేత్రంలో వైసిపికి తిరుగులేదని నిరూపించారు. ఒక వేళ టీడీపీ గనుక ఇక్కడ నుంచి పోటీచేసి ఉన్నట్లయితే బీజేపీకి ఇప్పుడు వచ్చిన ఓట్లు టీడీపీకి వచ్చి ఉండేవని ఒక వైసీపీ నాయకుడు విశ్లేషించారు. అప్పుడు బీజేపీకి యధావిధిగా 'నోటా' కంటే తక్కువ ఓట్లు వచ్చి ఉండేవని కూడా ఆయన చమత్కరించారు.

### చతికిలపడ్డ టిఆర్ఎస్...

ఆంధ్రాలో వైసీపీ దూసుకుపోతుంటే తెలంగాణలోని హుజూరాబాద్‌కు జరిగిన ఉప ఎన్నికలో అధికార టీఆర్ఎస్‌కు శృంగభంగం అయింది. ఇక్కడ, బీజేపీ టికెట్‌పై పోటీచేసిన ఈటల రాజేంద్రను సుమారు ఇరవైనాలుగు వేల మెజారిటీతో ఓటర్లు ఆశీర్వదించారు. టీఆర్ఎస్‌లో 'ట్రబుల్ షూటర్'గా పేరుబడిన హరీష్‌రావు నేతృత్వంలో టీఆర్ఎస్ మంత్రులు, ఎంఎల్ఏలు, జిల్లాలో వివిధస్థాయిలలో లెక్కకుమించి ఉన్న చిల్లరమల్లర నాయకులు, వందల కోట్ల రూపాయలు, సోషల్ మీడియా వీరులు, సొంత మీడియా ప్రచార హోరు... మొదలైన సమస్త వనరులనూ తెలంగాణ రాష్ట్రసమితి పెద్దలు హుజూరాబాద్‌పై మోహరింపచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, కుమారుడు కేటీఆర్, మేనల్లుడు హరీష్‌రావు ఈ నియోజకవర్గంలో ఉన్న కరీంనగర్ జిల్లానుంచే అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జగన్‌కి కడప సొంత జిల్లా లాగానే కేసీఆర్‌కి కూడా కరీంనగర్ సొంతజిల్లా అయినప్పటికీ, ఈటల రాజేందర్ విజయాన్ని ఆపలేకపోయారు. రాజకీయంగా ఈ అపజయం కేసీఆర్ కి శరాఘాతం అని పరిశీలకులు అంటున్నారు. కుమారుడు కేటీఆర్ ను ముఖ్యమంత్రి పదవి లో కూర్చుండబెట్టి, జాతీయ స్థాయిలో చక్రం తిప్పాలని కేసీఆర్ గట్టి పట్టుదలతో ఉన్నారనే అభిప్రాయం ఒకటి హైదరాబాద్ రాజకీయవర్గాలలో ఉంది. ఇప్పుడు, ఆ అభిలాష నెరవేరే విషయంలో కేసీఆర్ నిర్ణయాత్మకంగా వ్యవహరించే అవకాశం ఉంది. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ కాదు అనే భావనకు కేసీఆర్ వచ్చే అవకాశం ఉంది. అందువల్ల, కుమారుడు కేటీఆర్ త్వరలోనే తెలంగాణకు ముఖ్యమంత్రి కావచ్చు.


### 'దళిత బంధు' ఉంటుందా... ఊడుతుందా?

హుజూరాబాద్ ఎన్నికల్లో దాదాపు 30 శాతం ఉన్న దళిత ఓట్లను దృష్టిలో పెట్టుకుని, హడావుడిగా 'దళిత బంధు'ను నెత్తికెత్తుకుని ప్రారంభించిన గ్రామంలోనే, బీజేపీకి, టీఆర్ఎస్ కంటే ఎక్కువ ఓట్లు వచ్చాయి. దీనినిబట్టి, ఆ పథకం వాళ్ళ ఆశించినంత రాజకీయ ప్రయోజనం లభించలేదు అనే విషయం స్పష్టమైంది. మరోవైపు, ఈ పథకమే 2023 ఎన్నికల్లో టీఆర్ఎస్ పీకకు చుట్టుకోవడం తథ్యం అని కూడా పరిశీలకులు అంటున్నారు. అది తెలంగాణ అంతటా అమలు చేయాలంటే సుమారు రెండు లక్షల కోట్లు కావాలన్నది ఒక అంచనా. 'మరి మా సంగతి ఏంటి ?'అంటూ బీసీలు, ముస్లింలూ మొదలుపెట్టారు. వీరందరికీ అమలు చేయాలంటే మొత్తం భారతదేశం బడ్జెట్ కూడా సరిపోకపోవచ్చునని సీనియర్ పాత్రికేయుడు ఒకరు అభిప్రాయపడ్డారు. వారికి అమలు చేయకపోతే వారంతా కట్టగట్టుకుని టీఆర్ఎస్ పై తిరగబడే ప్రమాదం లేకపోలేదని ఆయన అభిప్రాయపడ్డారు. మరో పక్క 'దళిత బంధు' పథకాన్ని 10లో



## రామ్‌కుమార్‌రెడ్డికి క్యాబినెట్ హోదా

11లో



## లాయర్ ఆహ్వానము

లాయర్ పత్రిక

40వ వార్షికోత్సవ సంబరం

నవంబర్ 12, 2021 శుక్రవారం సాయంత్రం 4.00 గంటలకు నెల్లూరు, గొలగమూడి రోడ్డులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరుగును.

మీ ఆగమనం, ఆశీర్వాదం మాకు ఆనందం.



విశిష్ట అతిథులు

**శ్రీ యం.వెంకయ్యనాయుడు గారు**

గౌరవ భారత ఉపరాష్ట్రపతి వర్యులు



ఆత్మీయ అతిథులు

'పద్మభూషణ్'

**శ్రీ డా. కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి గారు**

వ్యవస్థాపక ఛైర్మన్, శాంతా బయోటెక్నిక్స్



'పద్మభూషణ్'

**శ్రీ డా. కె.శ్రీనాథ్‌రెడ్డి గారు**

అధ్యక్షులు, పబ్లిక్ హెల్త్ ఫౌండేషన్, ఇండియా



**శ్రీ డా. జి.సతీష్‌రెడ్డి గారు**

సెక్రటరీ, డిడిఆర్ & డి, ఛైర్మన్, డిఆర్‌డిఓ



జ్యోతిప్రజ్వలన

**శ్రీమతి & శ్రీ వి.ప్రభాకరరెడ్డి గారు**

రాజ్యసభ సభ్యులు

ఈ సందర్భంగా

**'విజయపథంలో నెల్లూరీయులు'**

కాఫీటేబుల్ పుస్తకం ఆవిష్కరించబడును.

మీ ఆగమనాభిలాషి

**తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు)**

సంపాదకులు, 'లాయర్' పత్రిక

గమనిక :

సాయంత్రం 3.30 గంటలకల్లా ప్రాంగణంలోకి వచ్చి ఆశీనులు కావలసిందిగా మనవి.

కోవిడ్ నిబంధనలు ఖచ్చితంగా పాటించవలెను.

# నెల్లూరు కబుర్లు

## కార్పొరేషన్‌కు అదనపు కమిషనర్



నెల్లూరు నగరపాలక సంస్థకు అడిషనల్ కమిషనర్‌గా పి.వెంకటేశ్వరరావును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆయన గతంలో కూడా నెల్లూరు కార్పొరేషన్‌లో పలు విభాగాల్లో విధులు నిర్వహించి ఉన్నారు.

### జాతీయ 'కీర్తి పతాక'గా నిలిచిన..

## కెవి చలమయ్య



నెల్లూరుకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కెవి చలమయ్య ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 'జాతీయ కీర్తిపతాక' పురస్కారం అందుకున్నారు. జాతీయపతాకాన్ని పింగళి వెంకయ్య రూపొందించి నూరేళ్లు పూర్తయిన సందర్భంగా కెవి చలమయ్యకు ఈనెల 1న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు ఈ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, విజయవాడ నగర మేయర్ భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సినీనటుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొని ఆయనకు ఈ పురస్కారాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా కెవి చలమయ్య మాట్లాడుతూ విశిష్టమైన జాతీయ కీర్తిపతాకం పురస్కారం అందుకోవడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. నిర్వాహకులకు ఆయన తన కృతజ్ఞతలు తెలిపారు.

## జౌళి సంచులు వాడండి

### కమిషనర్ దినేష్‌కుమార్



పర్యావరణానికి పెనుముప్పుగా తయారైన ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేయాలని, ప్లాస్టిక్ కవర్లకు బదులుగా జౌళి సంచులు వాడుకోవాలని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని వైఎంసిఏ గ్రౌండ్ సమీపంలో ఏర్పాటైన జౌళి సంచుల దుకాణానికి ప్రారంభోత్సవం చేశారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జౌళిసంచులు, గుడ్డ సంచులు వినియోగించుకోవాలని, లాభాపేక్ష లేకుండా నగరంలోని పలు ప్రాంతాల్లో వీటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా కూరగాయల కొనుగోలుకు ప్రజలు ఎక్కువగా ప్లాస్టిక్ కవర్లపైనే ఆధారపడుతున్నారని, వాటిని వాడడం మానేసి ఇళ్ళ దగ్గరనుంచే గుడ్డ సంచులు తెచ్చుకునేందుకు అలవాటు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు.

## నిరుపేదలకు నిత్యావసర సరుకులు



దీపావళి పండుగను పురస్కరించుకుని నెల్లూరులోని పప్పుల వీధిలో ఉన్న జేసీ భవన్‌లో ఈనెల 1న నిరుపేదలకు దాతలు నిత్యావసర సరుకులు పంపిణీచేసి తమ సేవాభావం చాటుకున్నారు. ఫినొలెక్స్ పైప్స్ సౌజన్యంతో ముకుల్‌మాధవ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ సేవా కార్యక్రమంలో ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు విలువచేసే నిత్యావసర సరుకులు అందజేశారు. నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని నిరుపేదలకు ఆ సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన దాతలను అభినందించారు. జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పేర్ల సీతారామారావుతో పాటు ఆ సంఘం గౌరవాధ్యక్షుడు, సూర్యనారాయణ, జనార్ధన్, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



### 'నీట్'లో...

## విశ్వసాయి విజయదుందుభి

జాతీయస్థాయి నీట్-2021 ఫలితాల్లో స్థానిక మాగుంట లే-అవుట్ లోని విశ్వసాయి కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించి విజయదుందుభి మోగించారు. ఈ కళాశాల నుంచి 120 మందికి పైగానే విద్యార్థులు ఎంబిబిఎస్‌లో చేరేందుకు అర్హత సంపాదించగలరని ఆ కళాశాల ఛైర్మన్ డా.ఎన్ సత్యనారాయణ ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఒకే కళాశాల నుంచి ఇంతమంది విద్యార్థులు ఎంబిబిఎస్‌లో చేరనుండడం తమకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని ఆయన అన్నారు. నీట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఎ.అర్జున్ 653 మార్కులు సాధించి అత్యుత్తమంగా రాణించాడని ఆయన హర్షం వ్యక్తంచేశారు. అదేవిధంగా ఎం.అపూర్వ 650 మార్కులు, కె.ఎం హిందూజ 633, సిహెచ్ రాకేష్ 628, పి.బిందుభవాని 614, డి.స్వప్నిక 613, కె.శ్రీ అమృత 604, కె.సమైక్య 603 మార్కులతో ఉత్తమస్థాయిలో నిలిచారని ఆయన పేర్కొన్నారు. అంతేకాక తమ కళాశాలకు చెందిన 64 మంది విద్యార్థులకు 500కుపైగానే మార్కులు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక బివినగర్‌లోని విశ్వసాయి కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులందరినీ ఆయన అభినందించారు.

కళాశాల వైస్‌ఛైర్మన్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు వత్తిడి లేని విద్యను అందిస్తున్నామని, దాంతోపాటు విద్యార్థులు ఎంతో పట్టుదలతో చదువుకొని ప్రతిభతో రాణిస్తూ కళాశాలకు మంచిపేరు తెస్తున్నారని అంటూ విద్యార్థులందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్‌పర్సన్ ఎన్.రుక్మిణితో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు చెప్పారు.

## ఇందిరాగాంధీ సేవలు అమూల్యం



మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా గతనెల 31న నెల్లూరులో కాంగ్రెస్ నాయకులు నగరంలోని ఇందిరాభవన్‌లోను, ఆర్టీసి బస్టాండ్ కూడలిలోను ఉన్న ఇందిరాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ఇందిరాగాంధీ ఎన్నో రకాల సంక్షేమపథకాలను అమలు చేశారని, దేశానికి ఆమె సేవలు అమూల్యమని వివరించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఉడతా వెంకట్రావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. డిసిసి ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, కాంగ్రెస్ సేవాదళ్ ఛైర్మన్ అనిల్, కిసాన్ సెల్ ఛైర్మన్ ఏటూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

### గురుకుల పాఠశాల

## అవస్థలు తీర్చండి

చిల్లకూరు మండలంలోని బాలయోగి బాలుర గురుకుల పాఠశాలలో కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు అవస్థపడుతున్నారని, పరిశీలించి తగు సదుపాయాలు కల్పించాలని ప్రజారోగ్య పరిరక్షణ సమితి అధ్యక్షుడు చేమూరు రవికుమార్ ఈనెల 1న నెల్లూరులోని జేసీ హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గదులు చాలడం లేదని, ఇటీవల ఆరోతరగతిలో 80 మంది విద్యార్థులు చేరారని, అయితే పాఠశాలలో అందుకు తగ్గ వసతులు లేవని పేర్కొన్నారు. కేవలం రెండు గదులు మాత్రమే ఉన్నాయని, మరో రెండు గదులు ఖాళీగానే ఉన్నాయని, వాటిని బాగుచేయించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. కిటికీలకు మెస్‌లు లేక దోమలు ఎక్కువై విద్యార్థులు బాధపడుతున్నారని పేర్కొన్నారు.






కీ॥శే॥ యం.యస్.రెడ్డి గారు



కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు
వ్యవస్థాపకులు, 'లాయర్' పత్రిక

నవంబర్ 12న, పుట్టిన రోజు
సంబరాన్ని జరుపుకుంటున్న
లాయర్
పత్రికకు
40వ
వార్షికోత్సవ శుభాకాంక్షలు.

మల్లెమాల ఎంటర్‌టైన్‌మెంట్స్

## 'ప్రభా'తం

# ఆగని మరణమృదంగం



కరోనా ప్రపంచంలో మరణమృదంగాన్ని మోగిస్తూనే ఉంది. ఇప్పటిదాకా ఈ వ్యాధి బారినపడి ప్రపంచవ్యాప్తంగా 50 లక్షలా 24 వేలమంది ప్రాణాలు కోల్పోయారంటే కరోనా రక్కసి ఎంతగా మానవాళిని బలితీసుకుంటోందో తేటతెల్లమవుతోంది. కరోనా బాధితుల సంఖ్య 25కోట్లకు చేరువలో ఉంది. ఇంత భయంకరంగా వ్యాపిస్తూ కంటికి కనిపించకుండానే సూక్ష్మక్రిమి మానవాళిని కబళిస్తూనే ఉంది. కరోనాని జయించడానికి ప్రపంచమంతా ఒక్కటై కదలాలి. ఈ వ్యాధి నివారణకు టీకా ఒక్కటే శ్రీరామరక్ష కనుక, ప్రపంచంలో ప్రతిఒక్కరికీ టీకాను అందుబాటులోకి తేవాలి. ఈ వ్యాధిని నియంత్రించేందుకు ప్రపంచవ్యాప్తంగా భారీ చర్యలు తీసుకోవాలి. అదే ఇప్పుడు ప్రపంచం ముందున్న తక్షణ కర్తవ్యం.

కరోనా మరణమృదంగం మోగిస్తూనే ఉంది. ప్రపంచాన్ని ఇంకా మరణాలతో కకావికలం చేస్తూనే ఉంది. ఎప్పటికప్పుడు ఈ మహమ్మారి వ్యాధి తగ్గిపోతుందనుకుంటూనే ఉన్నా ఏమాత్రం తగ్గకుండా తన ప్రతాపం చూపుతూనే ఉంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధి బారినపడి ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతూనే ఉంది. కరోనా కోరలకు బలై మృతిచెందిన వారి సంఖ్య 50 లక్షలకు పైగానే దాటిపోవడంతో ప్రపంచం బెంబేలెత్తిపోతోంది. కరోనా వ్యాధి బయటపడినప్పటి నుంచి గత రెండేళ్ళుగా ఈ వ్యాధి తీవ్రత పెరిగిపోతూనే ఉంది తప్ప తగ్గడమే లేదు. ప్రపంచవ్యాప్తంగా ఈ వ్యాధి తగిలి ఆసుపత్రుల్లో చేరి కోలుకున్నవారి సంఖ్య కూడా కోట్లల్లోనే ఉన్నా, తగ్గేవారికి తగ్గుతుంటే కొత్తగా ఈ వ్యాధి సోకుతున్న వారి సంఖ్య కూడా నిత్యం లక్షలు దాటుతూనే ఉంది. నిత్యం ఈ వ్యాధితో ఆసుపత్రుల్లో నరకయాతన పడుతున్నవారి బాధలు చెప్పనలవి కాదు. మనదేశంలో కూడా కరోనా కోరలు చాస్తూనే ఉంది. అయితే ఇటీవలే టీకా అందుబాటులోకి రావడం, వైద్యసౌకర్యాలు కొంత మెరుగుపడడం, వైద్యసిబ్బంది అలుపెరుగని సేవలతో మనదేశంలో కోట్లాదిమంది బతికి బట్టకడుతున్నారు. లేకుంటే పరిస్థితి మరింత దయనీయంగా ఉండేది. వైద్య సదుపాయాలు సరిగా లేని పేదదేశాలనే కాదు అమెరికా వంటి అగ్రదేశాలను సైతం కరోనా గడగడలాడిస్తూనే ఉంది. ఉత్తర అమెరికా దేశాల్లో ఇప్పటికే దాదాపు పదకొండున్నర లక్షల మంది, దక్షిణ అమెరికా దేశాల్లో మరో 11.70 లక్షల మంది, ఆసియా దేశాల్లో మరో 2.18 లక్షల మంది దాకా చనిపోయారు. ఇంకా అనేక దేశాల్లో మరణాల సంఖ్య భారీగానే ఉంటోంది. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచానికే ఈ వ్యాధి ఒక సవాల్‌గా నిలుస్తోంది. గత 70 ఏళ్ళలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన అనేక యుద్ధాల్లో మృతిచెందిన వారి సంఖ్య కంటే కూడా.. కనిపించని ఈ సూక్ష్మక్రిమితో పోరాడలేక ప్రాణాలు పోగొట్టుకున్న వారి సంఖ్యే అధికంగా ఉందంటే ఈ రాకాసి వ్యాధి ఎంత కర్కశమైనదో తెలుస్తుంది. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్‌కో, లాస్ ఏంజెల్స్ నగరాల జనాభా కంటే ఈ కరోనాతో మరణించిన వారి సంఖ్యే ఎక్కువగా ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయినా.. ఒక సూక్ష్మక్రిమి వైరస్‌లా పరిణమించి ప్రపంచమంతా వ్యాపిస్తూ ప్రజలను గగ్గోలు పుట్టిస్తుండడం, లక్షలాదిమందిని పొట్టనపెట్టుకోవడం ప్రపంచ చరిత్రలోనే కనీవినీ ఎరుగని విషాదం!.. కరోనాతో అరకోటి మంది చనిపోవడం.. ఎంత దారుణం.. ఎంత బాధాకరం!.. ఒక దేశమని లేదు.. ఒక ప్రాంతమని లేదు. ప్రపంచంలో ప్రతి ప్రాంతం ప్రతిచోటా కరోనా విలయతాండవం చేస్తూనే ఉంది. ప్రపంచ మానవాళి ఈ భయంకర వ్యాధి నుంచి ఎప్పటికి బయటపడుతుందో చెప్పలేని పరిస్థితి. అందులోనూ అత్యంత ఆధునిక వైద్యం ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన ఈ కాలంలో కూడా ఈ సూక్ష్మ క్రిమి ఇంతగా విధ్వంసం చేస్తూ ప్రపంచమానవాళిని భయభ్రాంతులకు గురిచేస్తూనే ఉంది. ప్రపంచంలోని అన్నిదేశాలనూ ఈ వ్యాధి నేటికీ వణికిస్తూనే ఉంది. అగ్రరాజ్యం అమెరికాలోనే లక్షలాది మందిని ఈ విషపు వ్యాధి బలితీసుకుంది. ఎప్పటికప్పుడు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధిని నయం చేయడానికి మంచి వైద్యం, వ్యాధిని నియంత్రించడానికి టీకాలు, అవసరమైన మందులు అన్నీ ఉన్నా ఈ వ్యాధి నుంచి బయటపడలేకపోతూనే ఉన్నాం. అధికారిక గణాంకాల ప్రకారం చూసినా ఈనెల 2వ తేది నాటికి కరోనా మృతుల సంఖ్య 50 లక్షలా 24 వేలు దాటిపోయింది. మరో 24 కోట్లా 80 లక్షల మంది ఈ వ్యాధి పీడితులుగా బాధలు పడుతున్నారు. ఈ సంఖ్య మరికొద్దిరోజుల్లోనే 25 కోట్లకు చేరిపోనుందని భావిస్తున్నారు. మంది ఈ వ్యాధికి గురై చావుబతుకుల మధ్య పోరాడుతూనే ఉన్నారు. మనదేశంలోనూ ఇప్పటికి ఈ వ్యాధితో 4 లక్షలా 58 వేల మందిదాకా మృత్యువాతపడ్డారు. చనిపోయారు. ఇప్పటిదాకా కోవిడ్ బాధితుల సంఖ్య మనదేశంలో 3 కోట్లా 42 లక్షల మందికి పైగానే ఉం దంటే కరోనా ఎంతగా విజృంభిస్తోందో తేటతెల్లమవు తూనే ఉంది. కరోనా దెబ్బతో ప్రపంచ ఆర్థికవ్యవస్థ కుప్పకూలిపోయింది. ఏవో కొన్నిదేశాలు బొటాబొటిగా మళ్ళీ నిలదొక్కుకుంటున్నా అనేక దేశాల్లో అన్ని రంగాలు కుదేలైపోయాయి. ప్రజల జీవనం అస్త వ్యస్తంగా ఉంది. మానవాళి మనుగడకే కరోనా ఒక పెద్ద శాపంలా పరిణమించింది. ఏదేమైనా సరే, కరోనాను పూర్తి స్థాయిలో నియంత్రించడమే తక్షణ కర్తవ్యం. కరోనాని జయించడానికి ప్రపంచమంతా ఒక్కటై కదలాలి. కంటికి కనిపించకుండా, రకరకాలుగా రూపం మార్చుకుంటూ మానవాళిని కబళిస్తున్న ఈ మాయదారి వ్యాధిని రూపుమాపడానికి అన్ని దేశాలు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. కరోనా రక్కసి పీడను అంతం చేయడానికి, సాటి మనుషుల ప్రాణాలను కాపాడేందుకు మానవతా దృక్పథంతో ప్రతి దేశం ఈ కష్టకాలంలో ప్రజలను ఆదుకునేందుకు అవసరమైన వైద్యాన్ని, వైద్య పరికరాలను, శాస్త్ర పరిజ్ఞానాన్ని తరతమ భేదాలు లేకుండా ఇచ్చిపుచ్చుకోవాలి. ఈ భయంకర వ్యాధి నివారణకు టీకా ఒక్కటే శ్రీరామరక్ష కనుక, ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ టీకాను అందుబాటులోకి తేవాలి. అన్ని దేశాలు ఎక్కడికక్కడ ఈ వ్యాధిని నియంత్రించేందుకు భారీఎత్తున చర్యలు తీసుకోవాలి. వ్యాధి నుంచి తట్టుకోవడానికి అవసరమైన ఆక్సిజన్ వంటి పరికరాలను ప్రతిచోటా యుద్ధప్రాతిపదికపై అందుబాటులోకి తీసుకురావాలి. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ఎవరికి వారు స్వీయనియంత్రణలో ఉంటూ ఈ వ్యాధి బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మాస్కులు ధరించి, పరిశుభ్రతా చర్యలు పాటించి ఈ వ్యాధిని ఎక్కడికక్కడ అరికట్టాలి. అన్నింటికన్నా మానవాళి మనుగడకు అతిపెద్ద ముప్పు ఇదే. దానిని నివారించడమే ఇప్పుడు ప్రపంచం ముందున్న తక్షణ కర్తవ్యం.

## బ్యాంకు అభివృద్ధికి కోటేశ్వరరావు కృషి అపారం



ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు అభివృద్ధి రీజనల్ మేనేజర్ కోటేశ్వరరావు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా గత నెల 31న సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. నెల్లూరు జడ్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపిజిబి సిబ్బంది, అధికారులు ఘనంగా సన్మానించారు. వీడ్కోలు సభ ఏర్పాటుచేసి కోటేశ్వరరావు సేవలను కొనియాడారు. బ్యాంకు అభివృద్ధికి ఆయన చేసిన సేవలు అపారమన్నారు. ఆ తర్వాత కోటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఏపిజిబి ఒంగోలు రీజనల్ మేనేజర్ మస్తానయ్య, నాబార్ట్ ఏజిఎం రవిప్రకాష్, కడప విశ్రాంత ఆర్ఎం రాజశేఖర్‌రెడ్డితో పాటు రమణ, మహమ్మద్, ఆలీ పాల్గొన్నారు.

### ఊళ్ళమ్మ తల్లికి..

## పినాకినీ జలాలతో అభిషేకం



నెల్లూరు సమీపంలోని కోడూరుపాడు గ్రామదేవత ఊళ్ళమ్మ అమ్మవారికి గతనెల 31న పెద్దఎత్తున పూజలు జరిగాయి. ముఖ్యంగా మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారికి అభిషేకం కోసం ఎంతో భక్తిశ్రద్ధలతో పెన్నానది జలాలను కలశాల్లో నింపుకుని తలపై పెట్టుకుని గుడికి తీసుకువచ్చారు. ఆలయ అర్చకులు ఆ జలాలతో అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఆలయంలో వైభవంగా చండీ హోమం నిర్వహించారు. ఈ పూజల అనంతరం భక్తులందరికీ నిర్వాహకులు అన్నప్రసాద వితరణ చేశారు. స్థానిక నాయకుడు కోడూరు కమలాకర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

### 'గురునిలయం'లో..

## 16న దుప్పట్ల పండుగ



నెల్లూరు మూలాపేటలోని భగవాన్ వెంకయ్యస్వామి ఆలయం, 'గురునిలయం' నిర్వాహకులు ఈనెల 16న నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయనున్నారు. అవధూత భగవాన్ వెంకయ్యస్వామి సంకల్పంతో వెంకయ్య స్వామి శిష్యులు మాకాని వెంకట్రావు స్వామి గత 20 ఏళ్ళుగా దుప్పట్ల పండుగ పేరుతో నిరుపేదలకు ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించేవారు. ఇటీవల మాకాని వారు స్వర్గస్తులు కావడంతో ఆయన కుమారుడు గోపి, వారి కుటుంబ సభ్యులు ఆ సేవను కొనసా గిస్తున్నారు. ఈ నెలలో వానలు, చలి వాతావరణంతో వణికిపోతున్న వృద్ధులు, వికలాంగులు, యాచకులు, నిరుపేదలకు సుమారు 3 వేల మందికి ఈనెల 16న దుప్పట్లను అందజేస్తామని, ఆరోజున అన్నప్రసాద వితరణ కూడా చేస్తామని మాకాని గోపి తెలియజేశారు.

## వలంటీర్లకు గొడుగుల వితరణ

జిల్లాలో గత కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వలంటీర్ల విధి నిర్వహణకు ఇబ్బంది లేకుండా ఆ పంచాయతీ కార్యదర్శి తన సొంత నిధులతో గొడుగులు వితరణగా అందించారు. విడవలూరు మండలంలోని నాగమాంబాపురం గ్రామంలో ఈనెల 1న ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దాత, పంచాయతీ కార్యదర్శి హమీద్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్న తమ గ్రామంలోని 15 మంది వలంటీర్లకు గొడుగులు అందజేశామని తెలిపారు.

## కోట రోడ్లు బాగుపడేదెప్పుడు?




మండల కేంద్రమైన కోటలో రోడ్లు పరమ అద్వాన్నంగా ఉన్నాయి. ఇప్పుడు కురుస్తున్న వానల దెబ్బకి రోడ్లన్నీ గుంటలు పడిపోతున్నాయి. కోట నడిబొడ్డున ఉన్న రోడ్లు కూడా నడవలేనంత దయనీయంగా ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణం. ఇక్కడే గుడి, బడి అన్నీ ఉన్నాయి. పాదచారులతో పాటు వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్లు కూడా పాడైపోతున్నా, ఈ రోడ్లమీదనే అధికారుల వాహనాలు కూడా అవస్తలు పడి వెళ్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎక్కువగా రోడ్లు గుంతలు పడిపోయి ఉండడంతో పాదచారుల బాధ మరీ వర్ణనాతీతంగా ఉంది. నాయకులు, అధికారులు ఎప్పుడు పట్టించుకుంటారో.. ఎప్పుడు ఈ బాధలు తీరుతాయో?....

– కె.ఎస్ నాగయ్య, కోట.

## అటు వానలు.. ఇటు దోమలు

గత కొద్దిరోజులుగా వానలు కురుస్తున్నాయన్న సంబరమే కానీ, ఈ వానల దెబ్బకు నెల్లూరు నగరంలో మురుగుదిబ్బలు పెరిగిపోతున్నాయి. ఖాళీస్థలాలు, రోడ్ల పక్కలంతా అపరిశుభ్రత తాండవిస్తోంది. ఎక్కడ చూసినా ముక్కులు పగిలిపోయేంత దుర్గంధం వ్యాపిస్తోంది. చెత్తాచెదారాలు పేరుకుపోయి ఉండడం, వాటిపై వాన కురవడంతో దోమలు, ఈగలు బాగా ప్రబలిపోతున్నాయి. అసలే వానకాలమంటేనే సీజనల్ వ్యాధులు వచ్చే కాలం. ఈ అపరిశుభ్రవాతావరణం తోడైతే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటోందో అధికారులు ఆలోచించాలి. ఇళ్ళ మధ్యలో ఉన్న ఖాళీస్థలాలను కొందరు ఎంతోకాలంగా నిర్లక్ష్యంగా వదిలేసి ఉండడంతో అక్కడంతా చెట్టు పుట్టా పెరిగి గబ్బుకొట్టిపోతున్నాయి. ఈ ఖాళీ స్థలాలు దోమలకు, పందులకు, కుక్కలకు ఆవాసాలుగా మారిపోతున్నాయి. వీటిని పరిశుభ్రం చేయించేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకుంటే బాగుంటుంది. ఇప్పటికైనా, ఈ దుస్థితిని అధికారులు గమనించి నగరంలో పరిశుభ్ర వాతావరణం ఏర్పడేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

ఆర్. తిరుమలరావు, నెల్లూరు.




# బడి.. కంట తడి

*హైదరాబాదులోని ఒక అపార్టుమెంటులో పద్నాలుగవ ఫ్లోర్ నుండి గ్రౌండుఫ్లోరుకి వస్తున్నప్పుడు 12వ ఫ్లోర్‌లో ఒక 5 సంవత్సరాల బుడతడు ఎక్కాడు. 'హాయ్ వాట్స్ యువర్ నేమ్...?' అడిగాడో పెద్దాయన. 'అశుతోష్' చెప్పాడా బుడ్డోడు. 'విచ్ క్లాస్ ఆర్ యు స్టడీయింగ్...?' మళ్ళీ ఆయన ప్రశ్న. 'సెకండ్ క్లాస్'.. వాడి సమాధానం. 'విచ్ స్కూల్?' మళ్ళీ ఆయన ప్రశ్న. ఈసారి ఆ బుడతడు బుర్ర తిరిగే ప్రశ్న ఆయనని అడిగాడు 'స్కూల్..! వాట్ స్కూల్..?'.. అంతే నోరెళ్లబెట్టడం ఆ పెద్దాయన వంతయ్యింది. అంటే ఆ పిల్లోడికి బడంటే తెలియదు.*

ఒక్క హైదరాబాదే కాదు భారతదేశంలోనే... అలా అనుకుంటే ప్రపంచంలోనే చాలాచోట్ల, చాలా ఇళ్లల్లో పరిస్థితి ఇదే. కరోనా మహమ్మారి పుణ్యమా అంటూ ఎదురవుతున్న సంఘటనలు ఇలాంటివే. గత 20 నెలలుగా ఇళ్ళకే పరిమితమైన రేపటిపౌరుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అభం శుభం తెలియని పసి హృదయం.. బడంటే ఏమిటని ప్రశ్నించే దయనీయ పరిస్థితి ఏర్పడింది. ఆన్లైన్ క్లాసులతో లైన్ తప్పిన టీనేజీ డ్యామేజీ దిశగా పయనిస్తోంది. పుట్టిన మూడేళ్ళకి బడికి వెళ్ళవలసిన బుడతలు ఇంటి పట్టునే ఉంటూ గ్యాడ్జెట్ల మాయలో పడిపోతున్నారు.

తమకు ఊహ తెలిసినప్పటి నుండీ బడికి వెళ్లే అలవాటున్న పిల్లలు ఇప్పుడు ఒక్కసారిగా 20 నెలలకుపైగా ఇళ్లకే పరిమితమైపోవడంతో కొత్తలోకానికి అలవాటు పడిపోయారు, వింత అలవాట్లను నేర్చుకుంటున్నారు. నాలుగుగోడలు, ఐ పాడ్, సెల్‌ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్ తరగతులకు అలవాటుపడ్డవారు. ఇప్పుడు అయ్యవార్లు చెప్పే పాఠాలపై విముఖత చూపిస్తున్నారు. ఉంటే క్లాసు.. లేదంటే టి.వి., అది కాకుంటే వీడియోగేమ్‌లకు అలవాటుపడి బడి ఊసే మరచిపోతున్నారు. ఇప్పుడిప్పుడే మళ్ళీ బడికి వెళ్లడం అలవాటు చేసుకున్నవారు ప్రతి చిన్న విషయానికి తడబడిపోతున్నారు. అది తమకు అలవాటున్న పాత బడి అయినా ఏదో కొత్తగా ప్రవర్తిస్తున్నారు. కేవలం 20నెలల కాలంలోనే ఊహించని ఈ పరిణామానికి అమ్మానాన్నలు సైతం ఆశ్చర్యపోతున్నారు. ఇన్నాళ్లు తమ ఇంట్లో తమ కళ్ళముందే ఉంటున్న తమ పిల్లలలో ఇంతటి మానసిక మార్పును వాళ్ళు గమనించుకోలేకపోయినందుకు బాధపడుతున్నారు. కరోనా ముందువరకు చురుకుగా ఉన్న పిల్లల తాజా ప్రవర్తనతో అధ్యాపకులకు కూడా అర్థంకాని అయోమయస్థితి ఇప్పుడు విద్యావ్యవస్థలో నెలకొని ఉంది.


ఇంతటి దయనీయ పరిస్థితులు కళ్ళ ముందు కనిపిస్తున్నా కొంతమంది తల్లి తండ్రులలో మార్పు రావడంలేదు. గడచిన రెండు నెలలుగా మన రాష్ట్రంలోనూ, పక్క రాష్ట్రం తెలంగాణలోను స్కూళ్ళు పునః ప్రారంభమైనా ఇంకా చాలామంది అమ్మానాన్నలు తమ బిడ్డలను స్కూళ్లకు పంపించడానికి ఇష్టపడడం లేదు. ఇంట్లోనే ఉండి చదువుకుంటారులే అని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇంట్లో ఉండి చదువుకోవడం అంటే వర్క్ ఫ్రమ్ హోమ్ లాంటిది కాదు. పరిపక్వత కలిగిన పెద్దవాళ్ళు ఇంట్లో నుండి పనిచేయడం వేరే, విజ్ఞానవంతులు కావలసిన విద్యార్థినీ విద్యార్థులు ఇంట్లో కూర్చుని చదువుకోవడం వేరే. ఈ విషయంలో ముందుగా అమ్మానాన్నలకు మానసిక నిపుణులచేత కౌన్సిలింగ్ ఇప్పించాలని ఒక అధ్యాపకుడు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఇప్పటికే కరోనా పుణ్యమా అంటూ ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో చాలా స్కూళ్ళు మూతబడిపోయాయి. ఇంకా చాలా బళ్ళు మూసివేత దిశగా పావులు కదుపుతున్నాయి. ఇలాంటి తరుణంలో బళ్ళకు వస్తున్న విద్యార్థినీ విద్యార్థుల మైండ్‌సెట్ మానసిక నిపుణులకు కూడా అంతుబట్టడంలేదని ఒక సైక్రియాట్రిస్ట్ అభిప్రాయపడుతున్నారు.

ఇదే పరిస్థితి కొనసాగితే తమ పరిస్థితి ఏమిటంటూ... భావిభారత పౌరులను సమాజానికి అందించాల్సిన బడి.. ఇప్పుడు కంటతడి పెడుతోంది.




## 91వ జయంతి



జననం: 08-11-1930

మరణం: 18-01-1995

## కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారు

వ్యవస్థాపకులు

లాయర్ వారపత్రిక



# 15న మునిసిపల్ ఎన్నికలు

## ○ నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు
## ○ వేడెక్కుతున్న రాజకీయాలు

**ఎట్టకేలకు అందరూ అనుకుంటున్నట్లుగానే మునిసిపల్ ఎన్నికలకు ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎన్నికలు జరగనున్న ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఎన్నికల సంఘం ఆదేశాలతో నెల్లూరు కార్పొరేషన్‌కు, బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీకి ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చక్రధర్‌బాబు ఆధ్వర్యంలో జిల్లా అధికారయంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. దీంతో నగరంతో పాటు, బుచ్చిరెడ్డిపాళెంలో రాజకీయాలు ఊపందుకున్నాయి. అభ్యర్థులు ప్రచారాల్లో తలమునకలై ఉన్నారు.**

ఎంతోకాలంగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నెల్లూరు కార్పొరేషన్, బుచ్చిరెడ్డిపాళెం పంచాయతీ ఎన్నికలకు నగారా మోగింది. త్వరలోనే మునిసిపల్ ఎన్నికలు జరుగుతాయన్న ఊహాగానాలతో రాజకీయవర్గాలు ముందస్తుగా గత కొద్దిరోజులుగా వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్న నేపథ్యంలో ఎన్నికలు జరపాలని ఎన్నికల సంఘం నిర్ణయించడం, ఈనెల 1న ఎన్నికల నోటిఫికేషన్ కూడా విడుదల చేయడంతో ఆయా ప్రాంతాల్లో ఎన్నికల రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. నెల్లూరులోని 54 డివిజన్లకు, బుచ్చిరెడ్డిపాళెంలో 24 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. నోటిఫికేషన్ విడుదల కావడంతో ఈనెల 3 నుంచి ఫలితాలు ప్రకటించే దాకా ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు. నెల్లూరు కలెక్టరేట్‌లో ఈనెల 1న ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 15న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల దాకా ఎన్నికలు నిర్వహిస్తామని, 6న స్క్రూటినీ జరుగుతుందని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 8 వరకు గడువుంటుందన్నారు. 17వ తేదీన ఓట్ల లెక్కింపు జరిపి ఫలితలు ప్రకటిస్తామని, ఎన్నికలను పారదర్శకంగా పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నెల్లూరులో 456, బుచ్చిలో 38 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఈనెల 3 నుంచి ఫలితాలు ప్రకటించేదాకా ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. నెల్లూరులో 4,77,244 మంది, బుచ్చిలో 35, 436 మంది ఓటర్లున్నారని, ఓటర్లంతా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

### పంచాయతీలు, ఎంపిటిసి, జడ్పీటిసి స్థానాలకు

వివిధ కారణాల వల్ల ఖాళీలు ఏర్పడిన 7 ఎంపీటీసి, స్థానాలకు కూడా ఎన్నికలు జరుగుతాయని, ఈ నెల 5 నుంచి ఈ ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించి, 9న ఉపసంహరణ గడువు ముగిసిన అనంతరం అదేరోజున అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఖాళీ ఏర్పడిన 7 ఎంపీటిసి స్థానాలకు ఈనెల 16న ఎన్నికలు నిర్వహించి, 18న ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలు ప్రకటిస్తామన్నారు. గతంలో పోటీలో నిలబడి, ఆ తర్వాత మృతిచెందిన అభ్యర్థుల స్థానంలో ఆయా పార్టీల అభ్యర్థుల మాత్రమే ఈనెల 5న తమ నామినేషన్లను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలన్నారు. అదేవిధంగా నెల్లూరు రూరల్ మండలం సజ్జాపురం, పొదలకూరు మండలంలోని కనుపర్తి పంచాయతీ సర్పంచ్ స్థానాలకు, 37 వార్డు సభ్యుల స్థానాలకు 5,6 తేదీల్లో నామినేషన్లు స్వీకరించి 14వ తేది ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1 గంట దాకా ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. అదే రోజు ఓట్ల లెక్కింపు నిర్వహస్తామన్నారు. ఉప సర్పంచ్ ఎన్నికలు కూడా అదేరోజు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ విషయాలపై ఎవరికైనా ఏవైనా సందేహాలుంటే 1077 కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

## ఏపిజిబి రీజనల్ మేనేజర్‌గా శైలేంద్రనాథ్



ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్‌గా కె. శైలేంద్రనాథ్ ఈనెల 1న నెల్లూరులోని ఆ బ్యాంక్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బ్యాంకు అభివృద్ధికి కృషిచేస్తానని, బ్యాంకు అమలు చేస్తున్న వివిధ పథకాలను ఖాతాదారులకు చేరే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

# 'శివ మాల' ధారణం.. పుణ్యాల తోరణం!




**ఆల్తూరు గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో నెలరోజుల పాటు శివదీక్షలు**
**పంచాక్షరి సప్తాహంతో మారు మ్రోగనున్న మూలస్థానేశ్వరాలయం**



కార్తీకమాసం ఎంతో పవిత్రమైనది. ఈ మాసంలో ఆదిదంపతులైన పార్వతీపరమేశ్వరులను పూజించుకుంటే అన్ని కష్టాలు తొలగిపోయి సకల శుభాలు కలుగుతాయని పురాణాలు పేర్కొంటున్నాయి. అందులోనూ కార్తీకదీపాలతో కళకళలాడే ఈ మాసంలో శివమాల ధరించడం, శివదీక్ష చేయడం మరెంతో పుణ్యప్రదం. అందుకే ఆ పరమశివునికి పరమభక్తుడు, స్థానిక భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయం (శివాలయం) మాజీ ఛైర్మెన్ ఆల్తూరు గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులో గతకొద్దికాలంగా ప్రారంభించిన 'శివమాల ధారణ' కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ కార్తీకమాసంలో ఈనెల 5వ తేది నుంచి శ్రీ మూలస్థానేశ్వరాలయంలో 'శివమాల ధారణ' కార్యక్రమం నిర్వహించనున్నారు. శివభక్తుడైన ఆల్తూరు గిరీష్‌రెడ్డి శివమాలను ధరించి ఈనెల 5న దీక్షతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఆయనతో పాటు దాదాపు 500 మంది భక్తులు శివమాలను ధరించనున్నారు. కన్నులపండువగా జరగనున్న ఈ కార్యక్రమంలో శివభక్తులకు శివమాలతో పాటు వస్త్రాలను కూడా గిరీష్‌రెడ్డి ఉచితంగా అందజేస్తుండడం ఆయనకున్న భక్తి శ్రద్ధలకు నిదర్శనం. కార్తీకమాసంలో పరమశివుని పూజించుకోవడం భక్తులకు పూర్వజన్మ సుకృతమని ఈ సందర్భంగా గిరీష్‌రెడ్డి చెప్తూ, శివమాల ధారణతో పాటు కార్తీకమాసంలోని చివరి వారం రోజులు శివపంచాక్షరి సప్తాహం నిర్వహించి శివనామ స్మరణతో భజనలు నిర్వహిస్తామన్నారు. డిసెంబరు 5వ తేది దాకా ఎంతో దీక్షతో జరిగే ఈ శివదీక్షలో భక్తులు పాల్గొని ఆ పరమ శివుని కరుణాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

# లాయర్ 40వ వార్షికోత్సవం

**నవంబర్ 12న వేడుక వీపిఆర్ వేదిక**



జూన్ 5, 1981న, నెల్లూరుజిల్లా స్థానిక పత్రికా రంగంలో ఆవిర్భవించి, 40 సంవత్సరాలుగా పాఠకుల హృదయాలలో చెరగని ముద్ర వేసుకుని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న నెల్లూరీయుల జీవితాలలో భాగమైపోయింది మన 'లాయర్' పత్రిక. జూన్ 5, 2021కి నాలుగు దశాబ్దాలు పూర్తిచేసుకున్న మన 'లాయర్' నవంబర్ 12, 2021న 40వ వార్షిక సంబరాన్ని జరుపుకోబోతోంది. ఇదే వేదికపైన పత్రిక వ్యవస్థాపకులు తుంగా రాజగోపాలరెడ్డి 91వ జయంతి 'తుంగా పండుగ' కూడా నిర్వహింపబడుతుంది. నెల్లూరీయుల ముద్దుబిడ్డ, ఉషాపతి, మన భారతదేశ గౌరవ ఉపరాష్ట్రపతి మాన్యశ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ సంబరంలో విశిష్ట అతిథిగా పాల్గొనబోతున్నారు. వారితోపాటు శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపక ఛైర్మెన్ 'పద్మభూషణ్' డాక్టర్ కోడూరు ఈశ్వరవరప్రసాదరెడ్డి, పబ్లిక్‌హెల్త్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు 'పద్మభూషణ్' డాక్టర్ కొల్లి శ్రీనాథ్‌రెడ్డి, డిడిఆర్&డి కార్యదర్శి మరియు డిఆర్‌డిఏ ఛైర్మెన్ డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డి, ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులు జ్యోతి ప్రజ్వలన గావిస్తారు. ఈ సందర్భంగా 'లాయర్' పత్రిక ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'విజయపథంలో నెల్లూరీయులు' కాఫీ టేబుల్ పుస్తకాన్ని గౌరవ ఉపరాష్ట్రపతి ఆవిష్కరిస్తారు.

### శ్రీమతి స్వప్నకు 'తుంగా అవార్డు'



లాయర్ జన్మదినం సందర్భంగా, పత్రిక వ్యవస్థపకులు తుంగా రాజగోపాలరెడ్డి పేరు మీద అందించే 'తుంగా అవార్డు' ఈ ఏడాది మహిళా జర్నలిస్టు శ్రీమతి స్వప్న అందుకుంటారు. తొలిసారిగా ఒక మహిళ ఈ అవార్డును అందుకోనున్నారు. గత 18 సంవత్సరాలు పాత్రికేయురాలిగా, గాయకురాలిగా, యాంకర్‌గా వివిధ రంగాలలో శ్రీమతి స్వప్న తమ ప్రతిభను చాటుతున్నారు.

### సాయంత్ర 3.30 గంటలకల్లా ఆశీనులు కావాలి...

నవంబర్ 12వ తేదీ, శుక్రవారం సాయంత్రం 4 గంటల నుండి ప్రారంభమయ్యే ఈ సంబరానికి వచ్చే ఆహుతులు 3.30 కల్లా ప్రాంగణానికి చేరుకొని తమ సీట్లలో కూర్చోవాలని, కోవిడ్ నిబంధనలు తప్పక పాటించాలని కోరుతున్నాం.

## పొట్టి శ్రీరాములు త్యాగనిరతి నిరుపమానం

**కలెక్టర్ చక్రధర్‌బాబు**




ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం అసువులు బాసిన శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగనిరతి నిరుపమానమని, ఆ మహనీయుని స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి మరింతగా కృషిచేస్తామని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబరు 1న కలెక్టర్ నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపూజీ ఆశయాల సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన కృషి అపారమన్నారు. అమరజీవి స్ఫూర్తితో రాష్ట్రప్రభుత్వం అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అమలుచేస్తున్నదన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విజయారావు, జేసీ రోజ్‌మాండ్, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, అడిషనల్ ఎస్పీ వెంకటరత్నం, డిఆర్‌ఓ చిన్న ఓబులేసు, జడ్పీ సిఇఓ శ్రీనివాసరావు, డిపిఓ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కష్టంగా కాదు.. ఇష్టంగా చదువుకోవాలి

**విద్యార్థులతో నవలా రచయిత యండమూరి**



విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకోవాలని, బాగా చదువుకుని సమాజంలో ఉన్నత శిఖరాలు అందుకోవాలని ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ విద్యార్థులకు సూచించారు. ఈనెల 1న ఆయన కావలిలోని డిబిఎస్ ఇంజనీరింగ్ కాలేజీలో కెరీర్ గైడెన్స్-యూత్ ఎంపవర్‌మెంట్ అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో పాల్గొని చేసిన ప్రసంగం విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం కళాశాల నిర్వాహకులు డాక్టర్ దామిశెట్టి బాలసురేష్‌బాబు, సుధీర్‌నాయుడు యండమూరిని ఘనంగా సన్మానించారు. ప్రాసప్రవీణ అన్నదాత మణి తన అద్భుత వ్యాఖ్యానంతో అందరినీ అలరించారు. ప్రిన్సిపాల్ టివిరావు, గాదిరెడ్డి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ‘హైదరాబాద్’ రాష్ట్రంగా కలిసిపోదాం రండి!!

ఆంధ్రప్రదేశ్‌లో కూడా టీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేయాలని ఆంధ్ర ప్రాంతం వారు కోరుతున్నారంటూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇటీవల జరుపుకున్న టీఆర్ఎస్ ప్లీనరీలో చేసిన వ్యాఖ్యతో కొత్త ఆలోచనలు చిగురిస్తున్నాయి. ఈ వ్యాఖ్య చేయడంలోని ఆయన అంతరార్ధం వేరే కోణం అయి ఉండవచ్చు. తన పాలనలో తెలంగాణ వాసులు సుభిక్షంగా ఉన్నారని, తాను అమలు చేస్తున్న రైతుబంధు, దళిత బంధు వంటి పథకాలు చూసి ఆంధ్రావాళ్ళు కూడా టీఆర్ఎస్‌ను ఆంధ్రలోనూ పెట్టమంటున్నారంటూ ఓ చెణుకు విసిరి ఉంటారు. తెలుగు సినిమా లోకంలో త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను మాటల మాంత్రికుడుగా అభివర్ణిస్తున్నట్టుగానే తెలంగాణ రాజకీయాలలో కేసీఆర్‌ను ‘చమత్కార మాంత్రికుడు’గా పేర్కొనవచ్చు. ఆయన ఎవరిని... ఎప్పుడు... ఎందుకు... ఏ సందర్భంలో పొగిడినా, తిట్టినా ఒక రేంజ్‌లో ఉంటుంది. సభికులకు గిలిగింతలు పెడతారు. అలాగే, టీఆర్ఎస్ ప్లీనరీలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యతో, సభికులు నవ్వులు చిందించారు. అది అక్కడితో ఆగలేదు. కేసీఆర్ వ్యాఖ్యతో టీవీ చానెళ్లు బ్రేకింగ్‌ల మీద బ్రేకింగులతో ఊదరగొట్టాయి. విషయం క్షణాలలో ఆంధ్ర నలుమూలలకూ చేరిపోయింది. ఆంధ్రప్రదేశ్ సమాచార మంత్రి పేర్ని నాని వెంటనే శృతి కలిపారు. ‘ఇక్కడ మళ్లీ ఆ పార్టీ ఎందుకు? ఆంధ్రనే మీరు కలిపేసుకుంటే సరిపోతుంది కదా, మీరో తీర్మానం చేయండి.., మిగిలింది మేము చూసుకుంటాం’ అని ఆయన ముక్తాయించారు. నిజానికి ఆంధ్ర వారిలో నూటికి 90 శాతంమందిలో ఉన్న భావనే ఇది. కాకపోతే, పేర్ని నాని నోట్లో నుంచి వచ్చింది. తెలంగాణ, ఆంధ్ర కలిసే ఉండాలని చెప్పడానికి ఓ వంద కారణాలు చెప్పవచ్చు. హైదరాబాద్‌లో జనాభా కోటి ఇరవై లక్షలు అనుకుంటే... అందులో అరవై లక్షల మందికి పైబడిన వారి మూలాలు ఆంధ్ర ప్రాంతానికి చెందినవే. శరీరాలు అక్కడ..., మనసులు ఇక్కడ హైదరాబాద్. ఉద్యోగాల కోసం... ఉపాధి అవకాశాల కోసం... వ్యాపారాల కోసం... బతకడం కోసం... చావడం కోసం... ఆంధ్రలోని దాదాపుగా ప్రతి రెండవ ఇంటి నుంచి కనీసం ఒక్కరైనా హైదరాబాద్ జపం చేయాల్సిందే. అక్కడ ఆంధ్రాలో డిగ్రీ పాస్ అయితే, ఉద్యోగానికి ఇక్కడికి హైదరాబాద్. అక్కడ జబ్బు చేస్తే, వైద్యానికి ఇక్కడికి హైదరాబాద్. అక్కడ పిల్లాడు పుడితే... స్కూల్‌లో వేయడానికి ఇక్కడకు హైదరాబాద్. అక్కడ నెల తప్పితే... డెలివరీకి ఇక్కడకు హైదరాబాద్. అక్కడ పెళ్లిచేస్తే... పెళ్ళికొడుకు – పెళ్లి కూతురూ ఇక్కడికి హైదరాబాద్. అక్కడ రిటైర్ అయితే, రిటైర్మెంట్ డబ్బులతో(వస్తే, గిస్తే గనుక) శేషజీవితం గడపడానికి ఆ డబ్బులు పుచ్చుకుని, ఇక్కడకు హైదరాబాద్.. అక్కడ ఇస్త్రీ పెట్టి వెయ్యడం నేర్చుకుంటే.. వాచ్‌మేన్–కం–ఇస్త్రీ చేసే ఉపాధి కోసం పెళ్ళాం పిల్లలతో సహా ఇక్కడికి హైదరాబాద్. ఒకటి అని కాదు. వంద రకాలుగా ఆంధ్రుల జీవన రీతులకు, జీవనాధారానికి కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్. ఆంధ్ర ప్రాంతపు రాజకీయ నాయకులకు రాజకీయం అక్కడ. నివాస భవంతులు, రాజ ప్రాసాదాలు, వారి కుటుంబీకుల వ్యాపార కార్యకలాపాలు...ఇక్కడ హైదరాబాద్. అక్కడి అధికారులు, అనధికార ప్రముఖుల స్థిర నివాసాలూ హైదరాబాదే. హైదరాబాద్‌లో స్థిరనివాసం ఏర్పరుచుకున్న తెలుగు సినిమా పరిశ్రమలో తొంభై శాతం మంది ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారే. ఇంతమంది తమ శ్రమ, తెలివితేటలు, సృజనాత్మకత, డబ్బుతో హైదరాబాద్‌ను సుసంపన్నం చేస్తూ వచ్చారు. ఎందుకంటే ఇది తమ అడ్డా అని 50 ఏళ్లకు పైబడి శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు పుట్టిన పిల్లల దగ్గరినుంచి అందరూ భావిస్తూ రావడమే ఇందుకు కారణం. అందుకే, అప్పుడు కలిసి ఉన్నప్పుడే కాదు ఇప్పుడు విడిపోయిన తరువాత కూడా హైదరాబాద్‌తో 13 జిల్లాల ఆంధ్రులు మమేకమై జీవిస్తున్నారు. ఇకముందూ జీవిస్తారు. నిజానికి, కలిసి ఉన్నా విడిపోయి ఉన్నా హైదరాబాద్ లేకుండా తెలుగువారు లేరు. తెలుగు వారు లేకుండా హైదరాబాద్ ఆర్థికాభివృద్ధి కూడా లేదు. పండగలప్పుడు, పబ్బాలప్పుడు బోసిపోయి నట్టుండే హైదరాబాద్ రోడ్లు, మాల్స్, థియేటర్లు, షాపులు, దుకాణాలు చూసేవారికి హైదరాబాద్ మనుగడకు ఆంధ్రులు ఎంత ముఖ్యమో తెలుస్తుంది. కాకపోతే తెలుగువారికీ వారి భాగ్యనగరమైన హైదరాబాద్‌కు మధ్య కేసీఆర్ ఓ చిన్న గీత గీశారు. అదొక సాంకేతికమైన గీతే.


ఆయన ఆ గీత గీసి ఉండకపోతే ఆయన ముఖ్యమంత్రి అయ్యే ప్రశ్న అసలు ఉదయించి ఉండేది కాదు. అమెరికాలో ఉన్న ఆయన కుమారుడు మంత్రి అయి, ముఖ్యమంత్రి పీఠం వరకు దగ్గరి దగ్గరగా వచ్చి ఉండే వారు కూడా కాదు. కుమార్తె ఒక ఎం.పీగా, ఒక రాజకీయ ప్రముఖురాలిగా తెలంగాణ ప్రాంతపు అధికార, రాజకీయ సమాజపు నీరాజనాలు అందుకుంటూ ఉండేవారు కానే కాదు.

నిజానికి ఇందుకు కేసీఆర్‌ను తప్పు పట్టవలసింది ఏమీ లేదు. ఆయన ఒక రాజకీయ నాయకుడు. రాజకీయ నాయకుడిగానే ఆలోచించారు. తన రాజకీయ భవిష్యత్తు, తన కుటుంబ భవిష్యత్తుకు ఏమి చేయాలో... అది చేశారు. సఫలీకృతులయ్యారు. తన రాజకీయ, కుటుంబ ఆకాంక్షలు ఉమ్మడి రాష్ట్రంలో ఎప్పటికీ నెరవేరవని ఆయనకు తెలుసు. అనేకమంది సీనియర్లు, సమర్థులు ‘చంద్రబాబు రథ చక్రాలు’ పదఘట్టనల కింద పడి నలిగిపోవడమో...., కనుమరుగైపోవడమో కళ్లారా చూసిన కేసీఆర్ ఆ కాడి కింది నుంచి బయట పడాలనుకున్నారు. బయటపడ్డారు.

ఫలితంగా ఆయన రాజకీయ, కుటుంబ ఆకాంక్షలు సమస్తం సంపూర్ణంగా నెరవేరాయి. కుటుంబం స్థిరపడింది. యాదాద్రిలో మరో తిరుమల అవతరించింది. తిరుమలకు సంబంధించి... శ్రీకృష్ణదేవరాయలు పేరు మనం ఇప్పటికీ చెప్పుకుంటున్నట్టు యాదాద్రిని సందర్శించే భవిష్యత్... భవిష్యత్... భవిష్యత్ తరాల పరంపర కూడా కల్వకుంట్ల చంద్రశేఖరరావు పేరును ప్రేమతో, ఆత్మీయతతో..., అభిమానంతో స్మరించుకుంటుంది. తన రాజకీయ, కుటుంబ, ఆర్థిక ఆకాంక్షలు నెరవేరినందువల్ల ఆంధ్ర–తెలంగాణ అంటూ మధ్యలో తాను గీసిన గీతను ఆయన ఇప్పుడు తిరిగి చెరిపేయవచ్చు. ఇదీ చరిత్రాత్మకమే అవుతుంది.

ఆంధ్ర మంత్రి పేర్ని నాని చేసిన సూచనపై ప్రతిస్పందన బాగానే ఉన్నది. టీఆర్ఎస్ నుంచి ఏ ఒక్కరూ కూడా పేర్ని నాని సూచనపై అధికారికంగా స్పందించ లేదు. ఏ స్పందనా లేకపోవడం కూడా మంచి స్పందనే. ఇందుకో ఉదాహరణ కూడా ఉంది.

1992లో బాబ్రీ మసీదు కూలగొట్టడానికి దేశవ్యాప్తంగా జనం అయోధ్యకు చేరుకుంటుంటే మీరు స్పందించరేమిటి అంటూ అప్పటి ప్రధాని పీ.వీ.నరసింహారావును ఓ విలేకరి అడిగితే, ఆయన ఓ చిరునవ్వు నవ్వి.. వక్క పలుకును నములుతున్నట్టుగా దవళ్లు ఆడిస్తూ , ‘ఏ స్పందనా వ్యక్తం చేయకపోవడం కూడా నా స్పందనే..’ అని అన్నారు. అలాగే... ఇప్పుడు, పేర్ని నాని సూచనపై కేసీఆర్ గానీ, టీఆర్ఎస్ గానీ, మంత్రులు గానీ, ఎంఎల్‌ఏలు గానీ అధికారికంగా ఎటువంటి ప్రతిస్పందన వ్యక్తం చేయక పోవడం కూడా శుభ పరిణామమే!






దీంతో, సంగారెడ్డి కాంగ్రెస్ ఎంఎల్‌ఏ తూరుపు జయ ప్రకాశ్‌రెడ్డి తన మనసులో మాట బయటపెట్టారు. తాను ఎప్పుడూ సమైక్యవాదినేనని, ఉద్యమం జరిగిన కాలంలోనూ తాను సమైక్యవాదిగానే ఉన్నానని తెగేసి చెప్పారు. తనను తెలంగాణ ద్రోహి అని నిందించినా ఎంఎల్‌ఏగా తానే గెలిచానని గుర్తు చేశారు. కేసీఆర్ ముందుకు వస్తే తాను కేసీఆర్‌ను సమర్థిస్తానని కూడా జగ్గారెడ్డి చెప్పారు. పేర్ని నాని సూచనను తాను సమర్థిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఆయన తెలంగాణ కాంగ్రెస్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్. భవిష్యత్‌లో పీసీసీ ప్రెసిడెంట్ కాగలిగిన స్థాయి గలిగిన నేత. ఇక, తెలంగాణలో తన రాజకీయ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న డాక్టర్ వై.ఎస్. గారి కుమార్తె షర్మిల ఈ ఆలోచనను వ్యతిరేకిస్తూ మాట్లాడారు. ఆమె వ్యతిరేకత అర్థం చేసుకోతగినదే. ఆమె ఆందోళన ఆమెది.

గతంలో జర్మనీ దేశం కూడా తూర్పు జర్మనీ, పశ్చిమ జర్మనీ దేశాలుగా విడిపోయాయి. చివరికి రాజధాని నగరమైన బెర్లిన్‌ను కూడా మధ్యలోకి చీల్చి రెండు దేశాలూ చెరోముక్కను పంచుకున్నాయి. ఆ ముక్క మీద వాలిన కాకి... ఈ ముక్క మీద వాలకుండా మధ్యలో గోడను కూడా కట్టుకున్నారు. ఆ ప్రయోగం విఫలం కావడంతో రెండు దేశాలూ కలిసి, ఒకే దేశంగా అవతరించాలని 1990లో నిర్ణయించాయి. ఇప్పటికీ, ప్రతిఏటా అక్టోబర్ 3న జర్మన్ ఏకీకరణ దినం పాటిస్తున్నారు. విభిన్న రాజకీయ భావజాలం, సంస్కృతులు, పాలనా రీతులు అనుసరించిన రెండు దేశాలు ఒకే దేశంగా అవతరించిన ఘటన మన కళ్ళ ముందు ఉన్నది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మూడు భాగాలు ఉన్నాయి. అవన్నీ కలిపి ‘తెలుగు జాతి మనది..., నిండుగ వెలుగుజాతి మనది’ అని నినదించిన ఆచార్య సి.నారాయణరెడ్డి తెలంగాణ ప్రాంత వాసి, జన్మతః. మరి, ఒకే దేశంలో విడిపోయిన ఒకే జాతి, ఒకే భాష, ఉమ్మడి ప్రయోజనాలు కలిగిన మూడు ప్రాంతాలు తిరిగి కలవ లేవా?

మరోపక్క, తన రాజకీయ ప్రభకు తిరుగు ప్రయాణం ప్రారంభమైందనే విషయం కేసీఆర్ గ్రహించాలి. ‘పెరుగుట విరుగుట కొరకే...’(లా ఆఫ్ డిమినిషింగ్ రిటర్న్స్) అనే సూత్రం కేసీఆర్ రాజకీయానికి క్రమంగా వర్తించే ప్రక్రియ ప్రారంభమైంది. అందుకే, ఆ మూడు ప్రాంతాలకూ గుండెకాయ వంటి హైదరాబాద్ పేరిట ‘హైదరాబాద్ రాష్ట్రం’గా ఏర్పాటుచేసే ప్రక్రియకు ఆయనే శ్రీకారం చుట్టాలి.

తాత్కాలిక ఆవేశకావేశాలతో విడిపోయిన అన్నదమ్ములను మళ్ళీ కలపడం ద్వారా తెలుగుజాతి చరిత్రలో కేసీఆర్ శాశ్వతంగా నిలిచి పోవాలి. ఆకాశంలో అరుంధతీ నక్షత్రంలాగా ఆయన కీర్తి ప్రతిష్టలు ఆచంద్ర తారార్కం నిలిచిపోవాలి.

**– భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

---

## గూడూరు డివిజన్ వార్తలు

### స్వచ్ఛ గూడూరుకు
# ప్రజలు సహకరించాలి


కమిషనర్ శ్రీకాంత్

సమిష్టి బాధ్యత, ప్రజల సహకారంతోనే స్వచ్ఛ గూడూరు కల సాకారం అవుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. గూడూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘంలో ప్లాస్టిక్ నిషేధించామని, వస్తువులు కొనుగోలు చేసే సమయంలో ప్రతిఒక్కరూ ఇంటి వద్ద నుంచే సంచులు తీసుకురావాలని చెప్పారు. చెత్తా చెదారాలను దుకాణదారులు ఇష్టానుసారంగా రోడ్లపై వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, దుకాణం వద్ద చెత్తకుండి ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు.

# అక్రమంగా తరలిస్తున్న నగదు స్వాధీనం



నెల్లూరు నుండి చెన్నైకు వెళ్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సులో ఎటువంటి లెక్కలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 66,56,900 రూపాయలను దొరవారిసత్రం పోలీసులు సీజ్ చేసి, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో గూడూరు డిఎస్పీ ఎం.రాజ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సూళ్లూరుపేట టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా... చెన్నై రాష్టానికి చెందిన బస్‌లో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తుల వద్ద ఉన్న బ్యాగులు తనిఖీ చేయగా అందులో ఎటువంటి లెక్కల పత్రాలు లేని నగదు 66,56,900 రూపాయలు ఉండడంతో ఆ నగదును సీజ్ చేసి, నగదు కలిగిన చెన్నైకు చెందిన కిరణ్, విష్ణులను అదుపులోకి తీసుకున్నామని, వీరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# ఇంటింటి ప్రచారంలో వినోద్‌రెడ్డి



జిల్లా పరిషత్ మాజీఛైర్మన్ దివంగత నల్లపరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డి మనవడు, వైఎస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి కోట గ్రామంలోని ఓటర్లను ఆకట్టుకుంటూ ప్రచారం చేస్తున్నారు. వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచారం చేస్తూ.. స్థానిక సమస్యలు తెలుసుకుంటున్నారు. రెండో ఎంపిటిసి సెగ్మెంట్ వైసీపీ అభ్యర్థి షేక్ మొబిన్ బాషాను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి అనీ ఆయన కోట ప్రజలను కోరారు. ఈ సందర్భంగా నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కోట గ్రామ ప్రధాన సమస్య పంట కాలవ సిమెంట్ లైనింగ్ పనుల విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే అధికారుల చేత 2కోట్లు ఎస్టిమేషన్ వేయడం జరిగిందని, ఆర్డర్ కోసం ఎదురుచూస్తున్నామని తెలియజేశారు. ఈ పని పూర్తైతే కోట గ్రామం అభివృద్ధి చెందుతుందని, కోట గ్రామ ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ఉంటారని తెలియజేశారు. ఈ ప్రచారంలో సర్పంచ్ వెంకట రమణమ్మ, ఉపసర్పంచ్ గాది భాస్కర్, వైసీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



### సిఎం చేతుల మీదుగా

# 'పొన్నాల'కు.. జీవన సాఫల్య పురస్కారం

పద్యాన్ని అత్యంత హృద్యంగా గానం చేస్తూ, పద్య నాటకరంగానికి ఎంతో ప్రఖ్యాతిని తెచ్చిన నెల్లూరీయుడు, ప్రముఖ రంగస్థల నటుడు పొన్నాల రామసుబ్బారెడ్డికి ఎంతో ప్రతిష్టాత్మకమైన డాక్టర్ వైఎస్సార్ జీవన సాఫల్య పురస్కారం లభించింది. ఆంధ్ర రాష్ట్ర అవతరణోత్సవం సందర్భంగా ఈనెల 1న అమరావతిలో కన్నులపండువగా జరిగిన కార్యక్రమంలో పొన్నాల ఈ పురస్కారాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం ఎంతైనా విశేషం. అదేవిధంగా వివిధ రంగాల్లో విశిష్టమైన సేవలందించిన నెల్లూరుజిల్లా వాసులు పలువురు ఈ జీవన సాఫల్య పురస్కారాలను అందుకున్నారు. తోటపల్లి గూడూరు మండలం నరుకూరు గ్రామానికి చెందిన యువరైతు యరబోలు శివ అభిరామ్‌రెడ్డి (పశుదాణా తయారీ), నెల్లూరు జిజిహెచ్‌లో పల్మనాలజీ విభాగంలో ఉత్తమ సేవలందిస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్, కొవిడ్ వారియర్‌గా ఉత్తమ సేవలందించిన డాక్టర్ నీతిచంద్ర, ప్రముఖ చేనేత కళాకారుడు..వెంకటగిరి బంగారుపేటకు చెందిన జి.రమణయ్యలు సిఎం చేతుల మీదుగా పురస్కారాలను అందుకున్నారు. నెల్లూరు జిజిహెచ్‌లో ఎంఎన్‌ఓగా విశిష్ట సేవలందిస్తున్న బాలభద్ర యోబు రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా అవార్డునందుకున్నారు.

# శ్రీసిటీ పోలీసుల ఆధ్వర్యంలో.. వైద్య శిబిరం



పోలీసు అమరవీరుల సంస్మ రణ వారోత్సవాలను పురస్కరించు కుని ఇటీవల శ్రీసిటీ పోలీసుల ఆధ్వర్యంలో చెరివి గ్రామంలోని ఎస్టీకాల నీలో ఉచిత వైద్యశిబిరం నిర్వ హించారు. శ్రీసిటీ డిఎస్పీ జగదీశ్‌నాయక్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు శ్రీసిటీలోని కావేరి ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో సుమారు వందమందికి ఆరోగ్యపరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెరివి గ్రామసర్పంచ్ డి.రత్నమ్మ, శ్రీసిటీ సెక్యూరిటీ చీఫ్ రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్, సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### ప్రతి ఊళ్లో...

# ఓ గ్రంథాలయం.. దేవాలయం.. సేవాలయం రావాలి

**- భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**



ప్రతి ఊళ్లో ఒక గ్రంథాలయం, దేవాలయం.. సేవాలయం రావాలని భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ఈనెల 1న ఆయన విజయవాడలోని రామ్మోహన్ గ్రంథాలయాన్ని సందర్శించి ఆ గ్రంథాలయం అభివృద్ధికి 5 లక్షల రూపాయల విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ చిన్నతనంలో తాను ఈ గ్రంథాలయానికి వచ్చానని, మహాత్మా గాంధీ కూడా ఇక్కడికి మూడుసార్లు వచ్చారని గుర్తుచేసుకున్నారు. పుస్తకపఠనంతో విజ్ఞానం పెరుగుతుందని ఆయన అన్నారు.

**ప్రజాప్రతినిధులు సంస్కారవంతమైన భాషను ఉపయోగించాలి :**

తొలుత కృష్ణాజిల్లాలోని గన్నవరం సమీపంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. క్రమశిక్షణ, సమయపాలన, నిజాయితీ, పట్టుదలతో ఎంతటి విజయాన్నయినా సాధించవచ్చని ఆయన విద్యార్థులకు ఉద్బోధించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కొందరు ప్రజాప్రతినిధులు మాట్లాడే భాష ఏవగింపుగా ఉంటోందని, ఉన్నత పదవుల్లో ఉన్నవారు హుందాగా నడుచుకోవాలని, సంస్కారంతో కూడిన భాషనే ఉపయోగించాలని సూచించారు. మాజీమంత్రి కామినేని శ్రీనివాస్, ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.


# మంత్రి గౌతమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి జన్మదిన వేడుకలు నెల్లూరులోని ఆయన క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా యువజన నాయకుడు మంగలపుడి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ కేబినెట్‌లో ఆజానుబాహుడు, నిస్వార్థపరుడు, పెద్దల పట్ల గౌరవం కలిగిన మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జన్మదిన వేడుకలకు నెల్లూరు నలుమూలల నుంచి యువత తరలిరావడం చూస్తే ఆయన పట్ల వారికి ఉన్న అభిమానమేంటో తెలుస్తోందన్నారు. 2014లో జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రత్యక్ష రాజకీయాలలో ప్రవేశించి రెండు దఫాలు ఆత్మకూరు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా గౌతంరెడ్డి సేవలందిస్తున్నారని, వైసీపీ ఆవిర్భావం నుంచి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటూ, పార్టీకి నెల్లూరు జిల్లాలో అన్నీ తానై ఎంతో సేవ చేస్తున్నారని, అలాంటి నాయకుడి నాయకత్వంలో పనిచేస్తున్నందుకు నెల్లూరు జిల్లా యువత గర్విస్తోందన్నారు.

# ప్రాచీనమైన శివాలయం..'భైరవకోన' దేవాలయం

*చుట్టూ ఎత్తయిన కొండలు. అక్కడక్కడా జలపాతాలు. చల్లని గాలులు.. పక్షుల కిలకిలారావాలు.. ఎటుచూసినా ప్రకృతి రమణీయ దృశ్యాలు.. అన్నీ కలగలిస్తే.. అదే భైరవకోన. దట్టమైన ఈ కొండకోనల్లోనే ఎంతో ప్రాచీనమైన కాలం నాటి అత్యద్భుతమైన గుహాలయాలున్నాయి. ఆ ఆలయాల సముదాయంలోనే ఎంతో విశిష్టమైన శివాలయం ఉంది. ఆ ఆలయమే..చరిత్రాత్మకమైన శ్రీ దుర్గా భైరవేశ్వరస్వామి దేవాలయం. జిల్లాలోని అత్యంత ప్రాచీనమైన శివాలయాల్లో భైరవకోన దేవాలయమే ప్రధానమైనదని ప్రతీతి. ముఖ్యంగా కార్తీకపున్నమి రోజున, మహాశివరాత్రి పర్వదినాల్లో మాత్రమే ఈ ఆలయప్రాంతమైన భైరవకోనలో భక్తుల సందడి ఉంటుంది. జిల్లాలో ఎంతో ఘనమైన చరిత్ర కల ఈ ప్రాచీనమైన ఆలయానికి ఎన్నో విశిష్టతలు ఉన్నాయి.*



నెల్లూరు-ప్రకాశం-కడప జిల్లాల సరిహద్దుల్లోని కొండల్లో ఉన్న భైరవకోన రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి. నెల్లూరు జిల్లాలోని సీతారామపురం మండలంలో కొత్తపల్లి గ్రామానికి దగ్గరలోని కొండల్లో కొలువై ఉన్న దివ్యాలయమే శ్రీ దుర్గా భైరవేశ్వర దేవాలయం. భైరవేశ్వరుడు కొలువై ఉన్న దేవాలయం కనుక ఈ కోనకు భైరవకోనగా పేరు వచ్చిందంటారు. దట్టమైన కొండల్లో..ఎంతో ఎత్తున ఉన్న కొండను తొలిచి, అత్యద్భుతమైన రీతిలో కళాఖండంగా మలిచి.. ఒకే కొండలో ఏకంగా తొమ్మిది అద్వితీయమైన గుహాలయాలను నిర్మించడం శిల్పకళ చరిత్రలోనే ఒక అద్భుతం. అంతటి అద్భుతాన్ని మన కళ్ళముందు సాక్షాత్కరింపజేస్తూ నాటి మహాశిల్పులు ప్రాచీన శిల్పకళకు..చెదిరిపోని గుడి కట్టి భావితరాలకి అందించారు.

## 7వ శతాబ్దానాటి ప్రాచీన గుహాలయాలు

భైరవకోనలో ఉన్న గుహాలయాలు క్రీ.శ 7వ శతాబ్దం నాటివని, పల్లవులు-చాళుక్యుల కాలంనాటి శిల్పకళా శైలి ఇక్కడ





మన దేవాలయాలు (72)

రాశిపోసినట్లుగా ఉందని చరిత్ర పరిశోధకులు భావిస్తున్నారు. క్రీ.శ 600-630 సంవత్సరాల మధ్యకాలంలో నాటి రాజైన మహేంద్రవర్మ పాలనలో ఈ గుహాలయాలు నిర్మించి ఉండవచ్చని, 7వ శతాబ్దంలో చాళుక్కుల కాలంలో ఈ ఆలయాలు ఎంతో వైభవంగా ఉన్నట్లు తెలుస్తోందని చరిత్రకారుల అభిప్రాయం. ఈ గుహాలయాలు ఎంతో అపురూప మైనవని, దక్షిణభారతదేశంలోనే అరుదైనవంటారు. మహాబలిపురంలోని శిల్పకళకు దగ్గర పోలికలున్న ఈ ఆలయ శిల్పకళ శతాబ్దాలు గడిచిపోతున్నా వన్నె తగ్గకుండా భక్తులను, పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తుంది. అసలు జనసంచారమే ఉండని అంత దట్టమైన కొండల్లో ప్రాచీనకాలంలో ఇంతటి అపురూప కళాఖండాలైన గుహాలయాలను ఎలా నిర్మించగలిగారా అని ఈ ఆలయాలను సందర్శించినవారంతా ఆశ్చర్యచకితులవుతుంటారు.

## త్రిముఖ దుర్గామాత

రెండంతస్తులుగా నిర్మించిన ఈ అపురూపమైన గుహాలయాల్లోనే ఆదిదేవుడైన ఆ మహాదేవుడు భైరవేశ్వరుడుగా కొలువుదీరి అనాదిగా భక్తుల పూజలందుకుంటున్నాడు. ఓ గుహాలయంలో త్రిముఖ దుర్గామాత కొలువుదీరి ఉండడం, అక్కడే శివలింగం ప్రతిష్ఠితమై ఉండడం భక్తులను పరవశింపజేస్తుంది. అందుకే ఈ ఆలయానికి శ్రీ దుర్గా భైరవేశ్వర దేవాలయంగా పేరు వచ్చింది. మరో గుహాలయంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ప్రతిరూపాలు కూడా ఉన్నాయి. అందుకే త్రిమూర్తులు ఒకే గుడిలో కొలువై ఉన్న ఆలయంగా భైరవకోన ఆలయం ఎంతో ప్రసిద్ధి. ఈ క్షేత్రంలో ప్రధాన దైవం..భర్గేశ్వరుడు. భైరవుడు క్షేత్రపాలకుడు. అందుకే ఈ కోనకు భైరవకోనగా ప్రఖ్యాతి. ఈ గుహాలయాల గోడల మీద, కొండలోనూ చిన్నవి, పెద్దవి ఎన్నో శివలింగాలు చెక్కబడి ఉన్నాయి అనేక దేవతాప్రతిమలు కూడా ఉన్నాయి. ఏటా మహాశివరాత్రి పర్వదినాల్లో, కార్తీకమాసం రోజుల్లో ముఖ్యంగా కార్తీక పున్నమి రోజున భైరవకోనకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. ఇక్కడున్న కోనేరులో స్నానాదికాలు చేసుకుని భైరవేశ్వరుని దర్శించుకుంటారు. అయితే మిగిలిన రోజుల్లో భైరవకోనకు వెళ్లాలంటే భయమేనంటున్నారు భక్తులు. అక్కడ జనసంచారం లేకపోవడం, ఎలాంటి కనీస వసతులు లేకపోవడంతో భైరవకోన అభివృద్ధికి ఆమడదూరంలోనే ఉంది. ప్రభుత్వం, పురాతత్వ పరిశోధకులు ఈ ప్రాంతాన్ని పర్యాటకానికి అనువుగా తీర్చిదిద్దగలిగితే అత్యంత ప్రాచీన శిల్పకళా సంపదకు నెలవైన భైరవకోన..భక్తులకోనగా కూడా మారుతుంది.

# ఆత్మీయ అభినందనలు




నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (నాటా) అధ్యక్షుడు(ఎలెక్ట్) కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానముల ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతిరెడ్డి దంపతులను గౌరవపూర్వకంగా కలుసుకుని అభినందించారు. త్వరలో అమెరికాలో జరగబోవు తన ప్రమాణస్వీకార కార్యక్రమానికి రావలసిందిగా వారిని ఆహ్వానించారు.

# ఈ ఫలితాలు దేనికి సంకేతం..?

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం తెలంగాణ అంతటా అమలు చేయాలని హుజూరాబాద్‌లో గెలిచిన ఈటల రాజేందర్ అప్పుడే డిమాండ్ మొదలుపెట్టారు. 'దళిత బంధు' పై కేసీఆర్ ఆశలు పెట్టుకున్నారు, కానీ అది ఓట్లు రాల్చలేదు అనే విషయం ఆయనకు అనుభవపూర్వకంగా తెలిసొచ్చింది. నిజానికి, ఏ సంక్షేమ పథకమూ ఓట్లు రాల్చదు. ఆ విషయం అనుభవపూర్వకంగా రుజువయ్యే వరకు నేతలు వాటి వెనుక పరుగులు తీస్తూనేవుంటారు.

## కమలానికి కలిసి రాలేదు

ఇక దేశంలో బీజేపీ పరిస్థితి కూడా పెద్ద ఆశాజనకంగా ఉన్నట్టు కనబడడం లేదు. పశ్చిమ బెంగాల్‌లో జరిగిన నాలుగు ఉపఎన్నికల్లో బీజేపీ ఓడిపోయింది. హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన మూడు అసెంబ్లీ, ఒక లోకసభ ఉపఎన్నికల్లో కూడా కమలనాథులకు చేదు అనుభవమే ఎదురయ్యింది. కర్ణాటక అసెంబ్లీకి జరిగిన రెండు ఉప ఎన్నికల్లోనూ ఒకచోట పల్టీ కొట్టింది. అదికూడా కర్ణాటక ముఖ్యమంత్రి బొమ్మై స్వంత జిల్లాలో. ఏపీలో సరే... బీజేపీ దిక్కూ మొక్కూ లేకుండాపోయింది. రాజస్థాన్‌లో కూడా మూడు ఉపఎన్నికల్లో బీజేపీకి చేదు అనుభవమే. మధ్యప్రదేశ్‌లో కంచుకోటగా ఉన్న నియోజకవర్గంలోనే బీజేపీ ఓటమి చవిచూసింది. ఏ ఒక్కచోటా కమలానికి కలిసిరాలేదు. ఒక్క తెలంగాణలో మాత్రం కేవలం ఈటల రాజేందర్ వల్ల బీజేపీ గట్టెక్కినట్టు స్పష్టమవుతోంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే హుజూరాబాద్ నియోజకవర్గంలో బీజేపీకి పదహారు వందల ఓట్లే వచ్చాయి. ఇప్పుడు, ఒక లక్షా ఆరు వేల ఓట్లు వచ్చాయి. కాబట్టి ఇది పార్టీ ప్రభావమా, వ్యక్తి ప్రభావమా అన్నది ఊహించుకోవచ్చు.

## దేనికి సంకేతం...?

ఈ ఫలితాలు భవిష్యత్ రాజకీయ పరిణామాలకు సంకేతాలుగా కూడా రాజకీయ మేధావులు విశ్లేషిస్తున్నారు. ఆంధ్రాలో జగన్‌పై జనంలో అసంతృప్తి ఉందన్న వార్తలు వ్యాపిస్తున్నా, ప్రత్యామ్నాయం లేదన్నది స్పష్టమైపోయింది. ఇదే తరుణంలో జగన్ ముందస్తు ఎన్నికలకు వెళ్తే మళ్ళీ మూడంకెల ఫలితాలే వస్తాయన్నది తథ్యంగా వారు చెప్తున్నారు.

అయితే తెలంగాణలో మాత్రం పరిస్థితి ఇప్పుడే అంచనా వేయలేమన్నది కూడా వారి అభిప్రాయం. ఇక్కడ కాంగ్రెస్ తెలుగుదేశంలాగా మూటాముల్లె సర్దేసుకోవాల్సిందేనని హుజూరాబాద్ ఫలితం తేల్చేసింది. కేవలం రెండువేల ఓట్లకే ఆ పార్టీ పరిమితమైపోవడం ఆ పార్టీకి జరిగిన ఘోర పరాభవం. ఇదే పరిస్థితి గతంలో జరిగి ఉంటే ఈపాటికే రేవంత్‌రెడ్డిని పార్టీపీకి పారేసి ఉండేది. ఆయన కంటే సత్తా ఉండే నాయకుడు పార్టీలో లేడనుకున్న కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పుడు సందిగ్ధంలో పడ్డట్టే. షర్మిల కూడా తెలంగాణ రాజకీయాలలో ప్రభావంచూపే అవకాశాలున్నాయి కాబట్టి తెలంగాణ రాజకీయ భవిష్యత్తును ఇప్పుడే అంచనా వేయలేమన్నది మేధావుల అభిప్రాయం. దేశంలో కాంగ్రెస్ పుంజుకోవడం, కమలం జోరు తగ్గడంతో కాషాయం స్పీడుకు బ్రేకులు పడుతున్నాయని ఖచ్చితంగా చెప్పొచ్చంటున్నారు విశ్లేషకులు. పార్టీ సుప్రీంని నేనే అని సోనియాగాంధీ ప్రకటించుకున్న తరువాత జరిగిన తొలి ఎన్నికలలో ఆ పార్టీ బాగానే బోణీ కొట్టింది కూడా. ఈ పరిస్థితులలో భవిష్యత్ రాజకీయాలు రసవత్తరంగా మారబోతున్నాయన్నది మాత్రం కాదనలేని సత్యం...!




# గంధోత్సవంలో పాల్గొన్న మంత్రి అనిల్



నెల్లూరులోని జెండావీధిలో ఉన్న ప్రముఖ దర్గా హజరత్ కంతర్లవలి దర్గాలో ఈనెల 2వతేదీ రాత్రి వైభవంగా జరిగిన గంధమహోత్సవంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా నిర్వాహకులను, స్థానిక నాయకులను ఆయన అభినందించారు. దర్గాలో ప్రత్యేక దువా నిర్వహించడం తనకెంతో సంతోషంగా ఉందని, భగవంతుని దయవల్ల ప్రజలంతా బాగుండాలని కోరుకుంటున్నానని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు నాయకులు ఎం.డి ఖలీల్ అహ్మద్, అతహర్, మున్వర్, మీరామొహిద్దీన్, ఆరిఫ్, షాకీర్‌బాబా, సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

# నీట్‌లో 'రత్నం' విద్యార్థుల సత్తా

నీట్ ఫలితాల్లో నెల్లూరులోని రత్నం మెడికల్ విద్యార్థులు, డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించారు. ఆ విద్యార్థులందరినీ కళాశాల ఛైర్మెన్ కెవి రత్నం అభినందించారు. నెల్లూరులోని మెడికల్ అకాడమీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు డి.సరయు 651 మార్కులు సాధించిందని, అదేవిధంగా జి.మనోజ్ఞ 645 మార్కులు, వై.సిరిరాయల్ 634, పివి శివానీరెడ్డి 630, పి.మహీధర్‌రెడ్డి 603 మార్కులతో జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సంపాదించారని తెలిపారు. మరో 25 మందికి పైగా విద్యార్థులు 550 మార్కులు, 50 మందికి పైగా విద్యార్థులు 500 మార్కులు, 150 మందికి పైగా విద్యార్థులు 450 మార్కులు సాధించి మొత్తంగా 80 మందికి పైగానే ఉచిత మెడికల్ సీట్లు సాధించనున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని ఉత్తమ ర్యాంకులు సాధించేలా బోధన నిర్వహిస్తామన్నారు. కళాశాల ప్రతినిధి బివి కృష్ణారెడ్డితో పాటు అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో... పేదలకు అన్నదానం



రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాతృమూర్తి శ్యామలమ్మ 8వ వర్ధంతి సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ప్రశాంతిరెడ్డి సూచనలతో ఈనెల 1న నెల్లూరులోని విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు ఆశ్రమాల్లో ఉన్న నిరుపేద వృద్ధులకు, అభాగ్య బాలలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. నగరంలోని గీతామయి వృద్ధాశ్రమం, ప్రగతి చారిటబుల్ ట్రస్ట్, జనహిత వాత్సల్య ఆశ్రమాల్లో ఉన్న పేదలకు ఈ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# వాకర్స్ ఆధ్వర్యంలో 'శతమానం భవతి'



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గతనెల 31న 'శతమానం భవతి' కార్యక్రమం నిర్వహించారు. అక్టోబరు నెలలో జన్మించిన వాకర్స్ సభ్యులకు శాలువాలు కప్పి బర్త్‌డే కేకు కట్‌చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమంలో 203 జిల్లా వాకర్స్ గవర్నర్ ఏకొల్లు రాఘవరెడ్డి, డిప్యూటీ గవర్నర్ వేలూరు రంగారావు, గౌరవాధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడులతో పాటు పాణ్యం వెంకటకృష్ణారెడ్డి, కల్పం రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సుంకరి ఆళ్వార్‌దాసును స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు దొడ్ల జయరామనాయుడు, వి.లక్ష్మీనారాయణరెడ్డి, జాయింట్ సెక్రటరీలు ఇనుకొండ సోను, లక్కాకుల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## మర్యాదపూర్వక కలయిక

రాష్ట్ర ఐ.టి మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి, టిటిడి అనుబంధ ఆలయాల ఉత్తర భారతదేశ అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, విఠపు బాలసుబ్రహ్మణ్యంలను ఇటీవల గౌరవపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలియజేస్తున్న జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ - వైయస్సార్సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి విజయకుమార్‌రెడ్డి దంపతులు.

# వృద్ధ దంపతులను ఆదుకున్న.. ఎమ్మెల్యే ప్రసన్న



తమ వైద్యఖర్చుల కోసం దాచుకున్న లక్షరూపాయలు చెదలు పట్టి పాడైపోవడంతో ఆవేదనకు గురైన వృద్ధదంపతులను కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న ఆదుకున్నారు. తమ తండ్రి, మాజీమంత్రి స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వారికి లక్ష రూపాయలను అందించి వారి అభిమానాన్ని చూరగొన్నారు. వాకాడులోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న మహబూబ్‌బాషా, తాజున్‌బీ దంపతులు దాచుకున్న డబ్బుకు చెదలు పట్టడంతో వారు బాధపడుతున్నారన్న సమాచారం తెలుసుకుని వారిని నెల్లూరులోని తన నివాసానికి పిలిపించి లక్ష రూపాయలను ట్రస్ట్ ద్వారా అందించడంతో ఎమ్మెల్యే సేవాగుణాన్ని అందరూ మెచ్చుకుంటున్నారు.

# గాండ్ల తెలికుల సంఘం అభ్యున్నతే ధ్యేయం

### జిల్లా అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు

గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అభ్యున్నతే ధ్యేయంగా అందరం కలసికట్టుగా కృషిచేద్దామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గ్రోసు సుబ్బారావు పిలుపునిచ్చారు. గతనెల 31న నెల్లూరులోని పరమేశ్వరి కళ్యాణమండపంలో ఆ సంఘం జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంఘం కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సమావేశంలో ఆ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా శాఖ గౌరవాధ్యక్షునిగా గిద్దలూరు ప్రభాకర్‌రావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా గ్రోసు సుబ్బారావు, తిరుపతి హరగోపాల్, కోశాధికారిగా వంజవాకం ధనుంజయ, కార్య నిర్వాహక అధ్యక్షునిగా చాకిరాల శేషయ్య, ఉపాధ్యక్షునిగా గురునాథం ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర కోశాధికారి గార్లదిన్నె నాగరాజు పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది. రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ యారం మంజుల తదితరులు పాల్గొన్నారు.

### కసుమూరు, ఏఎస్‌పేట దర్గాల్లో..

# భక్తిశ్రద్ధలతో గంధమహోత్సవాలు

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధిచెందిన కసుమూరు, ఏఎస్‌పేట దర్గాల్లో ఈనెల 2న కోవిడ్ నిబంధనలు పాటిస్తూ అత్యంత వైభవంగా గంధమహోత్సవాలు జరిగాయి. వెంకటాచలం మండలంలోని కసుమూరు మస్తాన్‌వలీ దర్గా గంధమహోత్సవం ఈనెల 2న జరుగగా, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేసుకున్నారు. ఈనెల 1వ తేది సోమవారం రాత్రి 12 గంటలకు సంప్రదాయబద్ధంగా చందన్‌మహల్ నుంచి పవిత్రమైన గంధాన్ని అశ్వంపై ఊరేగింపుగా దర్గా వద్దకు తీసుకువచ్చారు. మంగళవారం ఉదయానికి ఈ గ్రామోత్సవం దర్గాకు చేరుకుంది. కడప పీఠాధిపతి అరీఫుల్లా హుస్సేన్ దర్గాకి విచ్చేసి ప్రత్యేకప్రార్థనలు చేశారు. దర్గాపై సుగంధ ద్రవ్యాలు చల్లి స్వామి సమాధికి గంధలేపనం చేశారు. సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి దర్గాకు విచ్చేసి స్వామివారి సమాధిపై చద్దర్ కప్పి పూజలు చేశారు. వైకాపా నాయకులు మండల వెంకటశేషయ్య, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజానాయుడు మండల కోఆప్షన్ సభ్యుడు హుస్సేన్, సర్పంచ్ శివ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు దర్గా నిర్వాహకులు స్వామివారి గంధాన్ని పంపిణీ చేశారు.

### ఏఎస్‌పేట దర్గాలో ...

అనుమసముద్రంపేట(ఏఎస్‌పేట)లోని హజరత్ నాయబ్ రసూల్ దర్గాలో ఈనెల 1న 248వ గంధమహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. పీఠాధిపతి హఫీజ్‌పాషా పవిత్ర గంధం బిందెలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ప్రధాన దర్గాకు తీసుకువచ్చారు. దర్గాలోని సమాధులకు గంధలేపనం చేసి, అనంతరం గంధాన్ని భక్తులకు పంచిపెట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆత్మకూరు డిఎస్పీ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ వేణుగోపాలరెడ్డి పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

# రామ్‌కుమార్‌రెడ్డికి క్యాబినెట్ హోదా

## కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్‌గా నియామకం



దివంగత ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తనయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి, బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గాల పరిశీలకుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి క్యాబినెట్ హోదా కలిగిన సముచితమైన పదవి లభించింది. రామ్‌కుమార్‌రెడ్డి పార్టీకి చేస్తున్న ఉత్తమ సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన్ను సముచితమైన పదవిలో నియమించడం విశేషం. దీంతో, రామ్‌కుమార్‌రెడ్డిని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులివ్వడంతో జిల్లాలోని పార్టీ వర్గాల్లోనూ, ముఖ్యంగా నెల్లూరు, వాకాడు, వెంకటగిరి నియోజక వర్గాల్లోని నేదురుమల్లి అభిమానుల్లోనూ పెద్దఎత్తున సంతోషం వ్యక్తమవుతోంది. దాదాపు పదేళ్లుగా ఆయన విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ విద్యాసంస్థల ద్వారా విద్యార్థులకు, విద్యావ్యవస్థ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నారు కూడా. రామ్‌కుమార్‌రెడ్డికి క్యాబినెట్ హోదా లభించడంతో అనేకమంది ప్రముఖులు, నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. పార్టీకి తాను చేస్తున్న సేవలను గుర్తించి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తనకు ఈ పదవినివ్వడం పట్ల రామ్‌కుమార్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రిని కలిసి తన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలను ప్రభుత్వ పాలనలో భాగస్వామ్యం చేయడమే ఈ బోర్డు లక్ష్యమని, ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, బోర్డు లక్ష్యాలను సాధించేందుకు కృషిచేస్తానని రామ్ పేర్కొన్నారు.

కాగా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తుంది. ప్రజల శ్రేయస్సు, వారి అభివృద్ధి కోసం వివిధ పాలసీలు రూపొందిస్తుంది. వీటిలో ప్రజలను భాగస్వాములుగా చేయడం కోసం కృషి చేస్తుంది. ప్రభుత్వ పాలసీలు, అభివృద్ధి సంక్షేమ పథకాల మీద అభిప్రాయ సేకరణ జరుపుతుంది. ప్రజలు అందించే సూచనలను ప్రభుత్వానికి తెలియజేస్తుంది. ఈ లక్ష్యాలను నెరవేర్చేందుకు విద్యాశాఖలోని వివిధ యూనివర్శిటీలు, కాలేజీల వనరులను, సచివాలయ వలంటీర్ల, విద్యార్థుల సహకారం కూడా తీసుకుంటుంది. అందు కోసం ప్రతి నియోజకవర్గానికి ఇద్దరు కో-ఆర్డినేటర్లను కూడా నియమించుకుంటుంది.

### సినారా ఫౌండేషన్ - మల్లెతీగ

# కథల పోటీ ఫలితాలు

చిన్ని నారాయణరావు ఫౌండేషన్-మల్లెతీగ సంయుక్తంగా నిర్వహించిన తెలుగు కథల పోటీకి పెద్దసంఖ్యలో కథలు అందాయి. వాసంతి (సికింద్రాబాద్) రాసిన 'రేవతి పెళ్ళి' కథ రూ.8,000ల మొదటి బహుమతి గెలుచుకుంది. సృజన్ సేన్ (హైదరాబాద్) రాసిన 'లెగసీ' కథ రూ.5,000ల ద్వితీయ బహుమతి, వడలి రాధాకృష్ణ (చీరాల) రాసిన 'బ్రతుకు ఆవలి జీవితాలు' కథ రూ.3,000ల తృతీయ బహుమతి గెలుచుకుంది. విహారి (హైదరాబాద్) రాసిన 'లోపలి ప్రపంచం', సింహప్రసాద్(హైదరాబాద్) రాసిన 'బిర్యాని', బాలి(విశాఖపట్నం) రాసిన 'నూతిలో కప్పలు' శరత్ చంద్ర (హైదరాబాద్) రాసిన 'వెంట వచ్చునది' బళ్ళా షణ్ముఖరావు(విశాఖపట్నం) రాసిన 'పరిణామక్రమం, జిల్లేళ్ళ బాలాజీ (తిరుపతి) రాసిన 'మూతబడిన పొర్లు' తటవర్తి నాగేశ్వరి(కొవ్వూరు) రాసిన 'సత్యభామ', వియోగి (కర్నూలు) రాసిన 'స్ఫూర్తి', టి. తిప్పారెడ్డి (మదనపల్లి) రాసిన 'బోయకొండ బేరం' కథలు రూ.1,000ల ప్రత్యేక బహుమతికి ఎంపికయ్యాయి. జ్యూరీ ప్రత్యేక బహుమతికి శైలజామిత్ర (హైదరాబాద్) రాసిన 'ఆడపిల్ల' కథ ఎంపికైంది. త్వరలో జరిగే ప్రత్యేక సభలో కథకులకు బహుమతులు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు కథకులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తూ.. విజేతలకు అభినందనలు తెలిపారు.



వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్‌దాస్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విఆర్‌సి వాకర్స్ సభ్యులు




# శ్రద్ధాంజలి



జననం: 18.01.1946

మరణం: 05.11.2017

స్నేహశీలి, మృదుస్వభావి,
మంచి మనసున్న మహామనీషి, మానవతావాది

## ఆదాల రాఘవరెడ్డి గారు

పరమపదించి తేది. 05.11.2021 నాటికి
నాలుగేళ్లు పూర్తికానున్న సందర్భంగా
ఆ మానవతామూర్తిని స్మరించుకుంటూ...
వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తున్నాం.

భార్య
**ఆదాల అరుణ**

కుమార్తె
**ఆదాల సాయి అపర్ణ**

కుమారుడు - కోడలు
**ఆదాల వంశీకృష్ణ - రచన**

మనుమరాళ్ళు
**సాయి అనిక, సాయి అవని**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com